## చిట్టి కథ



# కొత్త పాఠం

చెంప ఛెళ్ళుమంది సుబ్రహ్మణ్యానికి -

'చెంపకు చెయ్యి పరంబైనప్పుడు - కంటికి నీరు ఆదేశమగును' చిన్నప్పుడు సరదాగా చెప్పుకునే తెలుగు సమాసం - అనుభవంలోకి వచ్చింది సుబ్రహ్మణ్యానికి.

సుబ్రహ్మణ్యం ఇంటికి చేరేసరికి ఎప్పుడూ లేనిది రణరంగంలా ఉంది ఇల్లు.

'అసలావిడకెందుకట? ప్రతీదానికీ తగుదునమ్మా అంటూ తయారు' - అత్తగారిని విసుక్కుంటోంది సుభద్ర, సుబ్రహ్మణ్యం భార్య.

'ఐనా అమ్మ ఎందుకు అనవసరంగా అన్ని విషయాల్లో కల్పించుకోవటం? తనదారిన తను తన సంగతి చూసుకోక?' మనసులోనే విసుక్కున్నాడు సుబ్రహ్మణ్యం, పైకంటే తల్లి బాధపడుతుందేమోనని.

'ఛీ! ఛీ! నిజంగా ఈ నోటికి బుద్ధిలేదు. తన ఇష్టమొచ్చినట్లు వాగటమేనా?' తనని తనే విసుక్కుంది ముసలావిడ - సుబ్రహ్మణ్యం తల్లి.

మనవరాళ్ళు, మనవడు ఏమనుకుంటున్నారో గానీ - కళ్ళల్లోను, ముఖంలోనూ మాత్రం చిరాకు.

ఇంతమంది చిరాకుకి కారణం ముసలావిడ.

ఆవిడకు గడిచిపోయిన రోజులు కళ్ళ ముందు గిరగిరా తిరిగుతున్నాయి.

• • •

పెళ్ళైన పది సంవత్సరాలకి ఎన్నో నోములు, వ్రతాలు చేస్తే పుట్టాడు ఈ చిట్టి సుబ్రహ్మణ్యం.

ఆ తర్వాత ఆయన తనను కొప్పడని రోజు లేదు, వాణ్ణి మరీ ముద్దు చేస్తున్నావంటూ. పైకి కోప్పడ్డా ఆయన మనసు తనకు తెలుసు. వాడంటే ఆయనకు ప్రాణం.

వాడి మనసుకు ఏమాత్రం బాధ కల్గించకుండా, పువ్వులాగా పెంచుకొచ్చింది. వాడేది కోరితే అది. అది తమకిష్టం లేకున్నా కష్టమైనా సరే. చదవమని గట్టిగా అంటే ఎక్కడ కష్టపెట్టుకుంటాడోనని వదిలేసినందుకు - వాడీరోజు గుమాస్తా మాత్రమే అయ్యాడు. తమ కలలు ప్రకారం వాడు గొప్ప చదువు - కలెక్టర్ చదవాలి.

చదువే కాదు. పెళ్ళి అంతే. ఎవరితో పెళ్ళికెళ్తే ఆ పెళ్ళిలో సుభద్రని చూసి, ఆమె తప్ప మరెవ్వరూ వద్దన్నప్పుడు, 'ఇంకా నయం, మనవాళ్ళమ్మాయే'నని సంతోషించింది. 'అదే ఏ కులం కానిదాన్నో చేసుకొంటానంటే?' వాడి మనసు కష్టపడకూడదని తనెన్ని నిష్ఠూరాలు భరించవలసి వచ్చేదో.

ఆ తర్వాత కూడా, తను 'వాళ్ళ' విషయాల్లో కల్పించుకొంటే ఎక్కడ వాడి భార్యకు కోపం వచ్చి, వాడి మనసుకు తన వలన కష్టం కలుగుతుందోనని - ఒకపక్కగానే ఉంటూ వచ్చింది.

మనవడు పుట్టినప్పుడు ఆయన పేరు పెడదామని ఎంతో ఆరాటపడింది? కోడలు తన 'తాత' పేరు పెడతానంటే నోరెత్తని సుబ్రహ్మణ్యాన్ని చూసి, మనసు రవ్వంత చివుక్కుమన్నా తనేమీ బయటపడలేదు.

తర్వాత ఆడపిల్లలప్పుడూ అంతే. ఈ విషయాలని కాదు. అసలు కోడలు ఏరోజు తనని లెక్కలని కాదు. తన మనసెంతసేపూ వాడికిష్టం కలగచేసిందని? తన మనసెంతసేపూ వాడికిష్టం కలగ కూడదనే. మొదటి పాపకు పార్వతీదేవి పేరు పెట్టమందామనుకుని - 'శ్రీరమ్య' అని పెడితే, అదీ ఆ దేవత పేరే కదా అని సర్దుకుంది.

అలాగే వాళ్ళ పెంపకం విషయంలోనూ! తను కల్పించుకొన్న రోజు - వాళ్ళకి మరీ 'స్వేచ్ఛ'నివ్వటం చూసి, తను కల్పించుకోవటం మానేసి, అన్నీ మౌనంగా చూడటానికి 'అతికష్టం' మీద మనసుని అలవాటు చేసుకుంది.

వాళ్ళు మరీ 'విచ్చలవిడిగా' పోతున్నట్లు తెల్సినా, చూస్తూ ఊరుకుంది. ఆడపిల్లలు వేసుకొనే ఆ బట్టలూ, వేళాపాళా లేకుండా స్నేహితుల ఇళ్ళంటూ గడపటం, అవేమీ తనకు నచ్చకపోయినా, పెద్ద తప్పు కాదులే అనుకొన్నా, 'రోజులెట్లా ఉన్నాయి?' పిల్లలు ఎన్నివిధాల పాడవగలరో అన్ని అవకాశాలూ ఉన్నరోజులాయె.

ఈ రోజు మటుకు, తనేమందనీ? కోడలు ఇంట్లో లేదు, వాడెవడో ప్రశాంతట. మనవడి ఫ్రెండు. రెండు గంటలైనా కదలడాయె. మనవడు ఉండడని తెల్సీ వాడా టైమ్‌లోనే ఎందుకు రావాలి? వచ్చినా అంతసేపు ఎందుకు ఉండాలి? ఆ మాట అడగగల చనువును వాళ్ళమ్మ తనకు మొదట్నుంచీ ఇవ్వలేదు. అందుకే దానికంత అలుసు. నానమ్మ ఒక్కర్తే ఉంది కదా అని హాల్లో కాకుండా, దాని గదిలో కూర్చొని గంటలు గంటలు ఆ మాటలేంటి?

అందుకే బయటకు పిలిచి, 'అమ్మాయ్, నాన్న వచ్చే టైము ఔతున్నట్లుంది' అంది. అంతే - ఇంకేమన్నా అన్నదా? లేదే!

దానికే కోడలు రాగానే, అది ఏం చెప్పిందో, ఏమో! తనని ఎన్ని మాటలంది? వాడొచ్చేసరికి ఈ గొడవ అయిపోతే బాగుణ్ణని ఎంత కోరుకుందో!

లేదే! ఇంకా పెరిగింది. తను మాట్లాడకుండా ఉండే కొద్దీ కోడలు రెచ్చిపోతోంది. తన మౌనం ఆవిడకు అగ్నికి ఆజ్యం పోసినట్లుగా ఉన్నట్లుంది.

కొంతమందికంతే, మాటకి మాట చెప్తేనే తగ్గుతారు. కానీ తను అట్లా కాదే. వీలైనంత వరకు ఈ గొడవ తగ్గించాలనే తన ప్రయత్నం.

ఇంతలోనే సుబ్రహ్మణ్యం, మనవడు రానే వచ్చారు. వాడు మరీ దుడుకు వెధవ. 'అమ్మా ఆవిడతో నీకెందుకే, నువ్వు రా లోపలికి' అంటూ లోపలికి లాక్కెళ్తున్నాడు.

'నా కూతుర్ని పట్టుకొని అన్ని మాటలంటుందా? దిక్కులేక గతిలేక - నా ఇంట్లో ఉండేదానికి అరుస్తూనే ఉంది కోడలు.

ఎన్నడూ లేనిది, ముసలామెకూ, ఆ మాటలు వింటూంటే కోపం, కాదు బాధ. కోడలు తనను అన్ని మాటలంటున్నా - కొడుకు నోరెత్తనందుకు ఒకలాంటి ఉక్రోషం.

అనుకోకుండా ఆవిడ మనసులో మాట బయటకొచ్చేసింది. 'రేపు నీ కోడలూ నిన్ను అదే మాటంటే' అని.

రయ్యిమని బయటికొచ్చి, "నా కొడుకెన్నడూ అటువంటి పరిస్థితి రానియ్యడు. వాడికి నేనంటే ప్రాణం. నన్నన్న వాళ్ళ చెంప ఛెళ్ళుమనిపించి, వాళ్ళ నోరు మూయిస్తాడు-" కొడుకును గర్వంగా చూసుకుంటూ అంది సుభద్ర.

చిన్నప్పట్నుంచీ పువ్వులా, మెత్తగా ఉంచిన మనస్సు గట్టిపడి, ఆటుపోట్లూ - మంచీ చెడూ తెలుసుకోవాలన్నట్లుగా, సుబ్రహ్మణ్యం చెంప ఛెళ్ళుమన్నది. అన్పించిందెవరో కాదు - ముసలావిడే!

- డి. అన్నపూర్ణ